క్లుప్తంగా

ఫ్రీజర్ బాక్స్‌కు ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న దాతలు

గిద్దలూరు రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు మార్చురీ ఫ్రీజర్ బాక్స్ కోసం పట్టణానికి చెందిన ఈదుల పాండురంగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి లక్ష్మీనరసమ్మ రూ.75 వేల నగదును ఆదివారం సంస్థ అధ్యక్షుడు గుళ్లా రామకృష్ణారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు మానవత సంస్థ కృతజ్ఞతలు తెలిపింది.

చర్చికి రూ. 25 వేలు వితరణ

మార్కాపురం: మండలంలోని రాజుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న తెలుగు బాప్టిస్టు చర్చి నిర్మాణానికి మార్కాపురం పట్టణంలోని తెలుగు బాప్టిస్టు టౌన్ కమిటీ సభ్యులు 25 వేల రూపాయల సాయాన్ని ఆదివారం మార్కాపురంలో కమిటీ సభ్యులకు అందించారు. తమ వంతు సహాయంగా ఈ నగదును అందిస్తున్నట్లు చర్చి అధ్యక్ష, కార్యదర్శులు జయపాల్, ప్రభుదాస్, ఉపాధ్యక్షులు జాన్ వినయ్ తెలిపాలు. కోశాధికారి రమేష్‌బాబు, సభ్యులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

యోగా టీచర్‌కు సన్మానం



నారాయణరెడ్డిని సన్మానిస్తున్న సంస్థ నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: సంఘ సేవకుడు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి సన్మాన సభను మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గుళ్లా రామక్రిష్టారెడ్డి, గంజి వీరయ్య, వీరారెడ్డి, గుర్రంకొండ నరసింహులు, పాలుగుళ్ల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన



మాట్లాడుతున్న ఆర్డీఓ

పొదిలి: జగనన్న ఇంటి స్థలాల ప్రక్రియను కనిగిరి ఆర్డీఓ పి.జాన్ ఎర్విన్ ఆదివారం పరిశీలించారు. నగర పంచాయతీ పరిధిలోని 3వ సచివాలయంలో నివేసన స్థలాల కన్వీయన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి పలు సూచలను చేశారు. వారి సందేహాలకు సమాధానాలు చెప్పారు. ఏమైనా అనుమానాలు ఉంటే వెంటనే తనకు ఫోన్ చేయాలని, త్వరితగతిన కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఆర్ఐ కె.సుబ్బారావు, వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

19న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠ

కురిచేడు: స్థానిక దర్శి రోడ్డులో నూతనంగా నిర్మించిన గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠకు ముహూర్తం ఆదివారం ఖరారు చేశారు. ఫిబ్రవరి 19వ తేదీ ఉదయం 10.28 గంటలకు ప్రతిష్ఠ, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఎస్‌టీయూ అధ్యక్షునిగా కశ్శెట్టి జగన్‌బాబు



నూతన కమిటీతో ప్రమాణం చేయిస్తున్న ఎర్రయ్య

తర్లుపాడు: తర్లుపాడు మండలశాఖ ఎస్‌టీయూ అధ్యక్షునిగా లక్ష్మక్కపల్లి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు కశ్శెట్టి జగన్ బాబు ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్‌రూ నజీర్ అహ్మద్, కోశాధికారిగా అంజనీకుమార్‌ను ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు అక్కల నారాయణ, ప్రసాద్, ఎర్రయ్య, మౌలాలి, సంజీవ్, రమేష్, శ్రీనివాసులు, సుబ్బారావు పాల్గొన్నారు.

కారు ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలు

గిద్దలూరు రూరల్: కారు ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని ఆదిమూర్తిపల్లె గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కలసపాడు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న ఆటోను రాచర్ల నుంచి నాయుడుపేటకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలంకు చేరుకుని క్షతగాత్రులను గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వెలిగొండపై తప్పుడు ప్రచారం తగదు

- టీడీపీ, తోక పత్రికలకు సీఎం వైఎస్ జగన్‌పై బురద చల్లడమే పని
- వైఎస్సార్ సీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్



ప్రభపై మాట్లాడుతున్న తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాలేదని టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కళ్లున్న కబోదుల్లా ప్రవర్తించడం వారి నైజమని వైఎస్సార్ సీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం రాత్రి మండలంలోని సర్వాయపాలెంలో గుత్తి కొండ రామయోగయ్య స్వామి తిరునాళ్ల సందర్భంగా పార్టీ వర్గీయులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై ఆయన మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తయినట్లు మెగా కంపెనీ ప్రకటించిందని, ఈ మేరకు వీడియోలు, ఫొటోలు కూడా విడుదల చేసిందని, వాటిని చూడకుండా ఇష్టం వచ్చినట్లు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. పచ్చపత్రికల్లో ప్రాజెక్టుపై ఇష్టానుసారంగా కథనాలు ప్రచురించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. టీడీపీ, దాని తోక పత్రికలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టును ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేయడం హర్షణీయమన్నారు. తీవ్రకరువు కాటకాలతో అలమటిస్తున్న పశ్చిమ ప్రాంతం త్వరలోనే సస్యశ్యామలం కానుందని ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అభివృద్ధికి బాటలు వేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ మూడమంచు బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, నాయకులు మాగులూరి వెంకటేశ్వర్లు, పల్లెపోగు పిచ్చయ్య, దూదేకుల నాసరయ్య, ఫిలిప్, ఎన్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జంకె ఆవులరెడ్డికి పరామర్శ

పెద్దదోర్నాల: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, దోర్నాల మండల మాజీ కన్వీనర్ జంకె ఆవులరెడ్డిని ఆ పార్టీ వైపాలెం నియోజకవర్గం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జంకెను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాటిపర్తితో జంకె మాట్లాడుతూ.. మండలంలో వైఎస్సార్ సీపీ క్షేత్రస్థాయిలో బలంగా ఉందని, విజయం నల్లేరు మీద నడకేనని అన్నారు. పార్టీ శ్రేణులందరినీ కలుపుకొనిపోవాలని సూచించారు. అనంతరం అగ్ని ప్రమాదంలో గడ్డి తగలబడిన సంఘటనలో బాధిత రైతు ఆరికట్ల శేషిరెడ్డికి రూ.10 వేలు అందజేశారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మజీద్, మాజీ ఎంయంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్, జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి దూదేకుల రసూల్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల కాశిం పీరా, మండల సచివాలయ కన్వీనర్ గుండారెడ్డి రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరెడ్డి, సచివాలయ కన్వీనర్లు జంకె సుబ్బారెడ్డి, చింతలచెరువు సుబ్బారెడ్డి, గుండారెడ్డి మల్లికార్జునరెడ్డి, మండల నాయకులు చంద్రకాంత్‌నాయక్, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, అల్లు రమణారెడ్డి, సర్పంచ్ పవన్‌కుమార్, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జంకె ఆవులరెడ్డిని పరామర్శిస్తున్న తాటిపర్తి



రైతుకు ఆర్థికసాయం అందిస్తూ..

కలిసికట్టుగా పనిచేయాలి

- కార్యకర్తలకు బూచేపల్లి దిశానిర్దేశం



శివప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న దొనకొండ మండల నాయకులు

దర్శి: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయాలని, అత్యధిక మెజార్టీతో విజయం సాధించేందుకు కృషి చేయాలని ఆ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. దొనకొండ మండల పార్టీ నాయకులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని దర్శిలోని ఆయన నివాసంలో మర్యాపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ.. జగనన్న చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి గ్రామంలో లబ్ధిదారులకు కలిగిన మేలుపై అవగాహన కల్పించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు.

వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

దర్శి: వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు దర్శిలోని తాలూకా క్లబ్ హాలు ప్రాంగణంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ కార్యాలయ ఇన్‌చార్జ్ సందిరెడ్డి నరేంద్రరెడ్డి కోరారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరవుతారన్నారని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలు, ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులకు చంద్రశేఖర్‌రెడ్డి ఆదర్శం



హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

మార్కాపురం: రిపబ్లిక్‌డే సందర్భంగా కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా అవార్డు అందుకున్న జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం. చంద్రశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయులకు ఆదర్శమని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి గుంటక చెన్నారెడ్డి, కన్వీనర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి అన్నారు. ఆదివారం మానవతా మార్కాపురం శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి చంద్రశేఖర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అందరికీ చంద్రశేఖర్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అనంతరం మానవతా సంస్థ ఆధ్వర్యంలో జనవరి నెలలో నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆర్‌కేజీ నరసింహం, పీవీ కృష్ణారావు, ఎస్. వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

అనుమానితులపై నిఘా పెంచాలి



సోమవరప్పాడు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఏఎస్పీ శ్రీధర్, పక్కన డీఎస్పీ

తాళ్లూరు(ముండ్లమూరు): గ్రామాల్లో అనుమానిత వ్యక్తులపై నిఘా పెంచాలని క్రైమ్ అడిషనల్ ఎస్పీ శ్రీధర్ ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని గుంటి గంగాభవాని ఆలయ సమీపంలో సోమవరప్పాడు వద్ద ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా తమ వెంట వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు వెంట తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. సరైన పత్రాలు లేని 5 వాహనాలను సీజ్ చేశారు. తనిఖీల్లో దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి, దర్శి సీఐ జె.రామకోటయ్య, ఎస్ఐ వైవీ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సేవ చేయడమే లక్ష్యం



షంషేర్‌ను సన్మానిస్తున్న రవిచంద్ర

మార్కాపురం: ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని అటు రైతులకు సేవలందించి ఇటు ప్రభుత్వానికి మంచి పేరు తెస్తానని మార్కాపురం మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ తెలిపారు. ఆదివారం ఆయనను పార్టీ ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర, శ్రీశైల దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు వెంగన్న, వైస్ చైర్మన్‌గా నియమితులైన పానుగంటి మురళి, డైరెక్టర్ సురేష్ తదితరులు షంషేర్ అలీబేగ్‌ను ఘనంగా సన్మానించారు. మార్కెట్ యార్డు ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్ర స్థాయిలో రైతులకు చేరుస్తానని షంషేర్ అన్నారు.

ఫిబ్రవరిలో ఉచిత ఉపనయనాలు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పొదిలి: విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక శామంతపూడి నాగేశ్వరరావు సామిల్లులో ఆదివారం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో విశ్వబ్రాహ్మణుల పిల్లలకు ఉచితంగా ఉపనయనాలు జరిపించాలని కనిగిరి పురోహిత పరిషత్ నిర్ణయించిందని తెలిపారు. విశ్వబ్రాహ్మణుల మద్దతు రాజకీయంగా కావాలంటే రెండు అసెంబ్లీ సీట్లు కేటాయించటంతో పాటు, ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కోరారు. అలా చేసిన పార్టీకే మద్దతు ఇస్తామని చెప్పారు. జరుగుమల్లికి చెందిన పేద విద్యార్థికి ఉన్నత చదువుల కోసం తమ వంతుగా రూ.12వేల ఆర్థిక సాయం అందించారు. సంఘం అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. సుతారాం శ్రీనివాసులు, కుందుర్తి సీతా రామాంజనేయులు, ఈశ్వరాచారి, శామంతపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ తల్లి



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో ఉన్న శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు ఆదివారం నిర్వహించారు. పోలేరమ్మ తల్లి భక్తులను చల్లంగా చూడాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి గాంచింది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి అమ్మవారు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్లు కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించారు.

కేదారేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపిలో ఉన్న కేదారేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి అమ్మవార్లను పూలతో అలంకరించారు. భక్తులు దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మార్కాపురం నుంచి భక్తులు హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకాలను అర్చకులు చేశారు.

త్రిపురాంతకం ఆలయ పాలక మండలి నియామకం



మంత్రి సురేష్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న ఇమ్మడిశెట్టి సుబ్బారావు

త్రిపురాంతకం: త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ నుంచి ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు ఆదివారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఆయన వెంట ఈఓ చెన్నకేశవరెడ్డి ఉన్నారు. సుబ్బారావుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి విద్యుత్ ప్రజాభిప్రాయ సేకరణ

మార్కాపురం: ఈనెల 29 నుంచి 31 వరకు విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నామని మార్కాపురం విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీవీ నాగేశ్వరరావు, డీఈ సియానాయక్ ఆదివారం తెలిపారు. 2024–25 సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షికాదాయం, అవసరాలు, రిటైల్ ధరలపై వినియోగదారుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నామని, తమ సూచనలు, సలహాలు, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెలపవచ్చన్నారు.

900 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

గిద్దలూరు రూరల్: మండలంలోని ఓబులాపురం తండా గ్రామ సమీపంలో గల అటవీ ప్రాంతంలో 900 లీటర్ల బెల్లం ఊటను స్థానిక సెబ్ సీఐ కొండారెడ్డి, ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం ధ్వంసం చేశారు. ఓబులాపురం అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేస్తున్నారని తెలియడంతో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని 900 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. నాటుసారా తయారీదారుల సమాచారం తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని సీఐ కోరారు.

చలో చెన్నై జయప్రదం చేయాలి

గిద్దలూరు రూరల్: అఖిల భారత విద్యార్థి సంఘం నిర్వహిస్తున్నటు చలో చెన్నై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు జీవన్‌కుమార్, తేజ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థుల హక్కుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ఆర్టీఓ అమర్‌నాయక్, పంచాయతీరాజ్ ఈఈ రమేష్‌బాబు, ఏఎస్‌డబ్ల్యూ అరుణ, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ పవన్‌కుమార్, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ తల్లటి పెద్దయ్య

అధికారులకు అభినందనలు

మార్కాపురం: విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు అధికారులకు రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని శుక్రవారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికా గర్గ్ అందజేశారు. వీరిని పలువురు అభినందించారు. మార్కాపురం ప్రాంతీయ రవాణ అధికారి అమర్‌నాయక్, పంచాయతీ రాజ్ ఈఈ వై. రమేష్‌బాబు, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి అరుణ, హౌసింగ్ డీఈ పవన్‌కుమార్, సబ్‌కలెక్టర్ ఆఫీస్ సబార్డినేట్ జానీబాషా, సబ్‌కలెక్టర్ కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసులు, పట్టణ కానిస్టేబుల్ గిరికుమార్, అటవీ శాఖ ఉద్యోగి భగత్‌రాజ్, 108 అంబులెన్స్ డివిజన్ ఇన్‌చార్జి వెంకటేష్, వేములకోట వీఆర్ఓ సుబ్బరామిరెడ్డి, భూపతిపల్లి వీఆర్ఏ బాషా తదితరులు అవార్డులు అందుకున్నారు.

తర్లుపాడు: ఎన్ఆర్ఈజీఎస్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ తల్లటి పెద్దయ్య, మీర్జపేట పంచాయతీ సెక్రటరీ గీతకు ప్రశంసపత్రం అందచేశారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ ఎస్. నరసింహులు, తహసీల్దార్ అబ్దుల్ హమీద్, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.